సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 28 । మే । 2024



సోమశిలలో 7.515 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 7.515 టీఎంసీల నీరు ఉంది. పెన్నార్ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.74,420
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,665
3 శాతం జీఎస్టీతో	రూ.6,865
సవర (8 గ్రా)	రూ.54,920



కొనసాగుతున్న కార్డెన్ సెర్చ్

జిల్లాలో పోలీసులు ఎన్నికల వేళ ప్రశాంతత కోసం అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు జల్లెడ పడుతున్నారు. అనుమానితులను విచారిస్తున్నారు.

8లో

న్యూస్‌రీల్

సజావుగా కౌంటింగ్ ప్రక్రియ చేపట్టాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరినారాయణన్, డీఆర్‌ఓ లవన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్

నెల్లూరు (దర్గామిట్ట): సీఈసీ నిర్దేశాలకు అనుగుణంగా సజావుగా కౌంటింగ్ నిర్వహించాలని కేంద్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా ఎన్నికల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఈసీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖబీర్‌సింగ్ పాల్గొన్నారు. నెల్లూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరినారాయణన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ లవన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 320

ఉదయగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ. 320 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 654 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 564 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. 90 బేళ్లను వివిధ కారణాలతో కొనుగోలు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్ట ధర రూ. 320, కనిష్ట ధర రూ.205 పలకగా, సగటున కిలో పొగాకుకు రూ.275.28 లభించిందన్నారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నెల్లూరు (టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు సంబంధించి జనరల్ 11,940 మంది విద్యార్థులకు గాను 11,405 మంది హాజరయ్యారు. 535 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 254 మందికి 216 మంది హాజరు కాగా, 38 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సంబంధించి జనరల్ విద్యార్థులు 2,379 మందికి 2,259 మంది హాజరయ్యారు. 120 మంది విద్యార్థులకు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలకు ఆర్‌ఐఓ ఆరు కేంద్రాలు, డీవీఈఓ 4 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 33 కేంద్రాలను పరిశీలించారు.

కామాక్షితాయి హుండీ రాబడి రూ.30.55 లక్షలు

కోవూరు: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో సోమవారం హుండీ కానుకలను లెక్కించారు. ఈఓ గిరికృష్ణ మాట్లాడుతూ మార్చి 21 నుంచి మే 27వ తేదీ వరకు అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించామన్నారు. ఆదాయం రూ.30,55, 976 వచ్చిందని తెలిపారు. హుండీ లెక్కింపులో దేవదాయశాఖ సిబ్బంది వెంకటసుబ్బయ్య, చైతన్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు

- కలెక్టర్ హరినారాయణన్



నెల్లూరు (దర్గామిట్ట): పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ కౌంటింగ్ సిబ్బందికి చెప్పారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గంలో సుమారు 24 వేల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌ను నిర్వహించడానికి 16 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ నిర్వహించడానికి 14 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి టేబుల్‌కు ఇద్దరు కౌంటింగ్ సూపర్‌వైజర్‌ను ఒక అసిస్టెంట్‌ను, ఒక మైక్రో పరిశీలకులను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.లవన్న, నోడల్ అధికారులు శ్రీనివాస్, టీ బాపిరెడ్డి, షాలోమ్ రాజా, రామారావు, కన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తోడుగా వెళ్లి.. మృత్యువు ఒడిలోకి..

అర్ధరాత్రి దాటిన తర్వాత వేకువ జామున తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లి వద్ద నాయుడుపేట–పుతలపట్టు జాతీయ రహదారిపై మృత్యు ఘోష మిన్నంటింది. తమ్ముడి భార్యకు మెరుగైన వైద్యం చేయించేందుకు కారులో తమిళనాడుకు బయలుదేరిన కుటుంబాన్ని డ్రైవర్ కునుకు రూపంలో మృత్యువు కబళించింది. నలుగురిని శాశ్వత నిద్రలోకి నెట్టేసింది. మొదలే అనారోగ్యంతో బాధపడుతున్న ఆ అభాగ్యురాలిని మృత్యువు అంచుకు చేర్చింది. కాళ్లు రెండూ విరిగిపోయి విలవిల్లాడుతూ భర్త పడుతున్న బాధ చూపరులను కలచి వేస్తోంది. ఈ ఘటన సోమవారం తెల్లవారు జామున తీవ్ర విషాదం నింపింది

తిరుపతి సమీపంలో రోడ్డు ప్రమాదం
- నలుగురు దుర్మరణం.. ఇద్దరికి తీవ్రగాయాలు
- మృతుల్లో ముగ్గురు ఒకే కుటుంబం
- నరసాపురం, గంగపట్నంలో అంతులేని విషాదం

డివైడర్‌ను కారు ఢీకొనడంతో నుజ్జు నుజ్జైన కారు ముందు భాగం, కాలువలో ఇరుక్కుపోయిన దృశ్యం





గడ్డపార సాయంతో మృతదేహాలను బయటకు తీసేందుకు యత్నిస్తున్న పోలీసులు

ఇందుకూరుపేట/చంద్రగిరి: కారు డ్రైవర్ కునుకు నలుగురి ప్రాణాలు తీసింది. మరో ఇద్దరిని ఆస్పత్రి పాల్జేసింది. ఈ ఘటన పూతలపట్టు–నాయుడు పేట జాతీయ రహదారి ఎ.కొంగరవారిపల్లి సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఆ ఊరులో అందరితో కలివిడిగా ఉండే కుటుంబం. ఆ ఇద్దరు అన్నదమ్ముల కుటుంబాలు వేర్వేరుగా ఉన్నా ఒకరికొకరు తోడు.. నీడగా ఉంటున్నారు. తమ్ముడి భార్యకు అనారోగ్యం ఉందని వైద్యం చేయించేందుకు తోడుగా వెళ్లారు. ఆదివారం రాత్రి వరకు తమ కళ్ల ఎదుటే కనబడిన ఆ దంపతులు తెల్లాసరే సరికి తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. తమ్ముడి దంపతులు తీవ్రగాయాలతో ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురు మృత్యువాత పడడంతో నరసాపురంలో విషాదఛాయలు అలముకున్నాయి.

మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన ఆడిగోపుల శ్రీనివాసులు, నీరజ దంపతులు. తన భార్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు భర్త శ్రీనివాసులు తమిళనాడులోని వేలూరు సీఎంసీ వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. సోమవారం ఉదయం అపాయింట్‌మెంట్ ఉండడంతో ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో అదే గ్రామానికి చెందిన సర్పంచ్ తాతా సురేంద్ర దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన తన కారును అతని వద్ద పని చేసే సమీర్ (23)ను డ్రైవర్‌గా ఇచ్చి పంపించాడు. వీరికి తోడుగా శేషయ్య(49), ఆయన భార్య జయంతి (42), మార్గమధ్యంలో మనుబోలు వద్ద నీరజ తల్లి ఆకురాయి పద్మావతమ్మ (58)తో కలిసి బయలుదేరారు.

మరో గంటలో ఆస్పత్రికి

మరో గంటలో వేలూరు సీఎంసీకి చేరుకుంటారనగా.. ఇంతలో ఒక్కసారిగా వారిని మృత్యువు కబళించింది. డ్రైవర్ సమీర్ (23) నిద్రలోకి జారుకోవడంతో రహదారి పక్కనే ఉన్న డివైడర్‌ను కారు అతి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవరు సమీర్‌తో పాటు శేషయ్య(49), ఆయన భార్య జయంతి(42), పద్మావతమ్మ(58) అక్కడికక్కడే మృతి చెందారు. కారు వెనుక భాగంలో కూర్చున్న శ్రీనివాసులు, నీరజ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ రామయ్య తన సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలు

కారు డివైడర్‌ను ఢీకొని, అక్కడే ఉన్న కాలువలో ఇరుక్కుపోయింది. మృతదేహాలను వెలికితీయడం కష్టతరంగా మారింది. పోలీసులు ఎంత శ్రమించినా ఫలితం లేకుండా పోయింది. చివరకు క్రేన్ సహాయంతో సుమారు రెండు గంటల పాటు శ్రమించి కారును సర్వీసు రోడ్డుపై ఉంచి.. గడ్డపారలతో అతికష్టం మీద మృతదేహాలను అధికారులు బయటకు తీశారు.



సమీర్ (ఫైల్)



శేషయ్య, జయంతి (ఫైల్)

విడిపోయిన ఇంజిన్ భాగాలు

అతి వేగంగా డివైడర్‌ను కారు ఢీకొనడంతో కారు ముందు భాగంలోని ఇంజిన్‌తో పాటు ఇతర విడి భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఇంజిన్ మొత్తం కారు నుంచి విడిపోయి డివైడర్ ముందు కాలువలో పడిపోయింది. కారులోని బ్యాటరీ సుమారు 40 అడుగుల దూరంలో పడిపోవడం చూస్తుంటే కారు ఎంత వేగంగా వెళ్లిందో అంచనా వేయవచ్చు.

నీరజ పరిస్థితి విషమం

క్షతగాత్రులు శ్రీనివాసులు, నీరజ తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా నీరజకు బలమైన గాయాలు తగిలాయి. ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టినట్టు అక్కడి వైద్యులు నిర్ధారించారు. పరిస్థితి విషమంగా ఉందన్నారు. శ్రీనివాసులు తలకు తీవ్ర గాయం కావడంతోపాటు, కాళ్లు రెండూ విరిగిపోయాయి. ఈ మేరకు వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

మృతదేహాల అప్పగింత

ప్రమాదంలో మృతి చెందిన పద్మావతమ్మ, శేషయ్య, జయంతి, డ్రైవరు సమీర్ మృతదేహాలకు వైద్యాధికారులు సోమవారం సాయంత్రం పోస్టుమార్టాన్ని పూర్తి చేసి ప్రత్యేక వాహనంలో ఇందుకూరుపేటలోని స్వగ్రామానికి తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

మిన్నంటిన రోదనలు

రుయా ఆస్పత్రి ప్రాంగణంలో శ్రీనివాసులు, నీరజ బంధువుల రోదనలతో మార్మోగింది. తమ్ముడుకు తోడుగా వెళ్లిన సోదరుడు శేషయ్య, ఆయన భార్య జయంతి మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. వారి కుటుంబీకులు గుండెలు బాదుకుంటూ.. ఆర్తనాదాలు చేయడం అక్కడి వారిని కలచివేసింది. క్షతగాత్రులు, మృతులు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో చూపరుల కళ్లు చెమర్చేలా చేసింది. శేషయ్య పొదలకూరులో బంగారు అంగడి నడుపుతున్నాడు. స్వగ్రామం నరసాపురం నుంచి పొదలకూరుకు వెళ్ల వస్తోంటాడు. ఏడాది క్రితం కుమార్తె పూజితకు పెళ్లి చేశాడు. కుమారుడు తేజ డిగ్రీ చదువుతున్నాడు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కారు డ్రైవర్ సమీర్ అవివాహితుడు. అతను గ్రామంలో అందరితో కలివిడిగా ఉండేవాడు. సాయంత్రం వరకు అందరితో ఉన్న సమీర్ తెల్లారే సరికి విగతజీవిగా మారాడని తెలియడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువుల్లో తీవ్ర విషాదం నిండిపోయింది.

ఎమ్మెల్యే ప్రసన్న పరామర్శ

కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రమాదం విషయం తెలుసుకుని స్థానిక సర్పంచ్ తాతా సురేంద్రతో ఫోన్ ద్వారా ఆరా తీశారు. అప్పటికే ప్రమాద స్థలం వద్దకు బయలుదేరిన సురేంద్ర జరిగిన విషయం ఎమ్మెల్యేకు చెప్పారు. వెంటనే తిరుపతి జిల్లాలోని పోలీసులు, వైద్యశాఖల అధికారులతో ఎమ్మెల్యే ఫోనులో మాట్లాడారు. బాధితులకు చికిత్సతో పాటు అన్ని విషయాల్లో సహకరించాలని అధికారులను కోరారు.

నిద్రమత్తే కారణం

కారు సోమవారం తెల్లవారుజామున సుమారు 5.40 గంటలకు ఎం.కొంగరవారిపల్లి వద్దకు చేరుకుంది. ఆ సమయంలో డ్రైవరు నిద్రమత్తులోకి జారుకోవడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుని ఉండవచ్చు. డివైడర్‌ను ఢీకొన్న సమయంలో ప్రమాదాన్ని తప్పించేందుకు డ్రైవరు కనీసం బ్రేకులు కూడా ఉపయోగించిన ఆనవాళ్లు లేవు.

– రామయ్య, చంద్రగిరి సీఐ



పద్మావతమ్మ, శేషయ్య, జయంతి, సమీర్ మృతదేహాలకు పంచనామా నిర్వహిస్తున్న అధికారులు

కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు

- కలెక్టర్ ఎం.హరినారాయణన్
- ప్రియదర్శిని కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన



కౌంటింగ్ కేంద్రంవద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. హరినారాయణన్ తెలిపారు. సోమవారం సాయంత్రం కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. తొలుత ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం కౌంటింగ్ కేంద్రంలో చేపడుతున్న ఏర్పాట్లను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. మీడియా సెంటర్, కౌంటింగ్ సిబ్బందికి భోజన ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇందుకు అన్ని ఏర్పాట్లను ఎటువంటి లోటుపాట్లు లేకుండా చేపడుతున్నట్లు చెప్పారు. కౌంటింగ్ సిబ్బందికి, ఏజెంట్లకు, మీడియాకు విడివిడిగా భోజన కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, టీ, స్నాక్స్‌కు ఇబ్బందులు లేకుండా, ఎక్కడా రాజీ పడకుండా నాణ్యమైన తాజాగా ఉండే ఆహార పదార్థాలను అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్ వాహనాలను మాత్రం కౌంటింగ్ కేంద్రం ముందు వరకు అనుమతి ఉంటుందని, ఇందుకు ప్రత్యేక పాసులు అందించాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, అడిషనల్ కమిషనర్ శర్మద, సిటీ ప్లానింగ్ అధికారి దేవి కుమారి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్

- బైండోవర్ చేసేందుకు పోలీసుల యత్నం
- నాయకులకు ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలంటూ హుంకరింపు

కావలి: ప్రశాంతంగా ఉన్న దగదర్తి మండలంలో పోలీసుల వైఖరి తీవ్ర వివాదాస్పదంగా మారుతుంది. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేసి బైండోవర్ పేరుతో ముందుగానే అదుపులోకి తీసుకునేలా పోలీసులు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారి తీసింది. ఎస్పీ ఆదేశాలంటూ సోమవారం మధ్యాహ్నం నుంచి దగదర్తి పోలీసు సిబ్బంది వైఎస్సార్‌సీపీ నాయకులకు ఫోన్లు చేయడం ప్రారంభించారు. స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లాలని, బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని చెబుతుండటంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడుకు కూడా ఎస్సై ఫోన్ చేసి స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లాలని చెప్పడం గమనార్హం. ఎస్పీ ఆదేశాల మేరకు బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని చెప్పడంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉత్తర్వుల కాపీ వాట్సప్‌లో పంపాలని కోరగా ఎస్సై నిరాకరించాడు. స్టేషన్‌కు వస్తే చూపిస్తామని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఎంపీపీ అసహనానికి గురయ్యాడు. టీడీపీ నాయకులను కూడా బైండోవర్ చేస్తున్నారా? అని ప్రశ్నించినా సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం. ఇప్పటి వరకు ఎటువంటి కేసులు లేని ప్రజాప్రతినిధిని, మండల ప్రథమ పౌరుడి హోదాలో ఉన్న ఎంపీపీతోనే ఫోన్‌లో పోలీసులు దురుసుగా ప్రవర్తించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కౌంటింగ్ తేదీ దగ్గరపడే సమయంలో కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులనే పోలీసులు టార్గెట్ చేసి స్టేషన్‌కు పిలిపిస్తుండడం వివాదాలకు దారి తీసేలా మారింది. ఈ విషయంపై దగదర్తి ఎస్సైను ఫోన్‌లో సంప్రదించగా స్పష్టమైన సమాధానం చెప్పలేక దాటవేత ధోరణిలో మాట్లాడారు. కౌన్సెలింగ్ అని, బైండోవర్ అని పొంతనలేని సమాధానాలు చెప్పారు. చివరగా సీఐతో మాట్లాడి పూర్తి వివరాలు చెబుతానని తెలిపాడు.

బరితెగించిన పోలీసులు

ఎన్నికల సమయంలో దగదర్తి మండలం తడకలూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిరంజీవి పోలింగ్ బూత్ వద్ద టీడీపీ నేతల ఆక్రమాలను అడ్డుకున్నారని, అతనిపై టీడీపీ రౌడీమూకలు, జలదంకి శ్రీహరినాయుడు, అతని తమ్ముడు మనోహర్‌నాయుడుతో పాటు వారి గ్యాంగ్ హత్యాయత్నం చేసినా.. పోలీసులు కనీసం కేసు నమోదు చేయకుండా ఆ పార్టీ నేతలకు కొమ్ము కాస్తూ అడ్డంగా పనిచేశారు. ఈ దాడులో పాల్గొన్న శ్రీహరినాయుడు వెంకటగిరి నియోజకవర్గంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తుండడం గమనార్హం. దీంతో కేసు తీవ్రతను నీరుగార్చేయత్నం చేశారు. ఇంతగా బరి తెగించిన పోలీసులు కనీసం మండలంలో టీడీపీ నేతలపై ఎలాంటి కేసులు నమోదు చేయకపోగా, తాజాగా బైండోవర్ కేసుల పేరుతో వైఎస్సార్‌సీపీ నేతలను వేధిస్తున్నారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు

సంగం: మండలంలోని తలుపూరుపాడుకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ బాద్‌షాపై సోమవారం రాత్రి సంగం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్సై నాగార్జునరెడ్డి సమాచారం మేరకు.. తలుపూరుపాడుకు చెందిన ఓ బాలిక తరుణవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ షేక్ బాద్‌షా కొంత మంది పిల్లలను ప్రతి నిత్యం తరుణవాయి పాఠశాలకు తీసుకెళ్తుండేవారు. అందులోని ఓ బాలికను ప్రతి నిత్యం తన ముందు కూర్చొబెట్టుకుని అసభ్యకరంగా మాట్లాడుతూ వేధిస్తూ ఉండేవాడు. అయినప్పటికి ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పలేదు. ఇటీవల సెలవులు రావడంతో ఈ నెల 25వ తేదీ బాలికను వేరే ప్రాంతానికి వెళ్లి అక్కడే ఉందామని బలవంతం చేశాడు. దీంతో బాలిక ఆమె తల్లిదండ్రులకు విషయం తెలపడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్‌కు పీడీ జీవన్



పీడీ జీవన్

ఉలవపాడు: ప్రపంచ మాస్టర్ అథ్లెటిక్స్‌కు మండల పరిధిలోని రామాయపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జీవన్‌కుమార్ ఎంపికయ్యారు. జూలైలో ఆస్ట్రేలియాలో జరిగే వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో 45 ఏళ్ల విభాగంలో ఆంధ్రా తరఫున ఆయన పాల్గొన్నారు. జావెలిన్ త్రో, హ్యామర్ త్రోలో బంగారు పతకాలు సాధించాడు. ఆయన ప్రతిభ చూపడంతో వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యాడు. జీవన్ చాలామంది క్రీడాకారులను తయారు చేసి ఉత్తమ పీడీగా అవార్డు అందుకున్నారు. జీవన్‌ను పాఠశాల సిబ్బంది సోమవారం అభినందించారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

• డ్వామా పీడీ వెంకట్రావు



పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

ఉదయగిరి: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పండ్ల తోటల సాగును ప్రోత్సహిస్తున్నామని డ్వామా పీడీ వెంకట్రావు తెలిపారు. కలిగిరిలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ రోజుకు రూ.300 గిట్టుబాటయ్యేలా కూలీలు నిర్ణీత కొలతల్లో పనులు చేయాలన్నారు. కనీసం నాలుగు గంటల సమయం పని చేసేలా చూడాలన్నారు. పనుల వద్ద ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. కూలీలు రెండు లీటర్ల తాగునీటిని వెంట తెచ్చుకోవాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో రోజుకు 80 వేల మంది పనులకు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 60 లక్షల పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. పండ్ల తోటలు సాగు చేసే రైతులకు దుక్కుల దున్నకం నుంచి మొక్కలు నాటడంతోపాటు మూడేళ్ల పూర్తి స్థాయిలో నిర్వహణ ఉపాధి హామీ పథకంలో చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామాలో మౌలిక వసతుల కల్పనకు కూడా ఉపాధి పథకం ద్వారా కొన్ని పనులు చేయిస్తామన్నారు. పనుల నిర్వహణపై సిబ్బందికి సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ రవీంద్ర, టీఏలు మధు, అనంద్ తదితరులు పాల్గొన్నారు.

12న పొట్టేళ్ల వేలం

ఉదయగిరి: కొండాపురం మండలం చింతలదేవి మిశ్రమ పశుగణాభివృద్ధి క్షేత్రంలో జూన్ 12వ తేదీన నెల్లూరు జోడిపి, పల్లా పొట్టేళ్లకు సంబంధించి వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు పి.మహేశ్వరుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 186 పొట్టేళ్లకు నిర్వహించే ఈ వేలంపాటలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు ఆరోజు ఉదయం 8 నుంచి 10 గంటల్లోపు రూ.5 వేలు దరావత్తు చెల్లించాలన్నారు. ఔత్సాహికులు జూన్ 10, 11 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు పశుక్షేత్రంలో ఉన్న పొట్టేళ్లను పరిశీలించవచ్చని తెలియజేశారు. మరిన్ని వివరాలకు చింతలదేవి పశుక్షేత్రంలో ఉన్న పశువైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతానికి గురై యువకుడి మృత్యువాత



వినోద్ మృతదేహం

అనుమసముద్రంపేట: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఏఎస్‌పేట మండలంలోని హసనాపురం గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సంగం మండలం కుమ్మరివీధికి చెందిన చిట్టమూరు బ్రహ్మయ్య, లక్ష్మమ్మల కుమారుడు వినోద్ (27) కరెంట్ పని చేస్తుంటాడు. అతను సోమవారం హసనాపురంలో ఓ ఇంటి వద్ద పని చేస్తున్నాడు. ఈదురుగాలుల కారణంగా వినోద్‌కు విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై కింద పడిపోయాడు. అక్కడి వారు గుర్తించి వెంటనే అతడిని ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఏఎస్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వినోద్ మృతితో తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు.

రక్తమోడిన రహదారులు

జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు మృతిచెందాయి. మనుబోలు మండలంలో ఒకరు, ఆత్మకూరు నియోజకవర్గంలో ఒకరు, అనంతసాగరం మండలంలో ఒకరు మృతిచెందారు.

• వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ముగ్గురి మృతి



మనుబోలు: ప్రమాద స్థలంలో యువకుడు



ఆత్మకూరు: రోదిస్తున్న కుటుంబసభ్యుడు



సోమశిల: ఘటనా స్థలంలో మృతదేహం

లారీని ఢీకొన్న మోటార్‌బైక్

మనుబోలు: లారీని మోటార్‌బైక్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం జరిగింది. కుప్పం నియోజకవర్గం నాయునూరుకు చెందిన బి.బాబు కుమారుడు బి.కార్తీ (20), తమిళనాడు కృష్ణగిరికి చెందిన జయరాం కుమారుడు జె.అరవింద్ బైక్‌పై నెల్లూరు నుంచి చెన్నైకి వెళ్తున్నారు. మండల పరిధిలోని వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద పొదలకూరు వైపు నుంచి వచ్చిన లారీ హైవేకి తూర్పున ఉన్న వే బ్రిడ్జ్ వద్ద వెళ్లేందుకు రోడ్డు దాటుతోంది. అదే సమయంలో వేగంగా వచ్చిన బైక్ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి వారిని వెంటనే చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కార్తీ మృతిచెందాడు. అరవింద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న మనుబోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా పడి..

ఆత్మకూరు: పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు ఓ కుటుంబం నెల్లూరు జిల్లాకు వచ్చింది. ఆత్మకూరు సమీపంలోని ఏఎస్‌పేట దర్గా సందర్శించేందుకు వెళ్తుండగా ముంబై జాతీయ రహదారిపై ఆటో బోల్తాపడి ఓ మహిళ మృతిచెందిన ఘటన సోమవారం జరిగింది. సీఐ జి.వేణు, ఎస్సై ముత్యాలరావు కథనం మేరకు.. వైఎస్సార్ జిల్లాకు చెందిన ఓ కుటుంబం ఏఎస్‌పేట, కసుమూరు, వేనాడు దర్గాలను సందర్శించేందుకు ఆటోలో వచ్చింది. ఏఎస్‌పేట దర్గాకు వెళ్లేందుకు ఆత్మకూరు సమీపంలోని పేట అడ్డరోడ్డు వద్ద మలుపు తిరుగుతుండగా ముందు వాహనాలను తప్పించే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆ ప్రమాదంలో ఆటోలో ముందు వైపు కూర్చొని ఉన్న కరీమున్నీసా (45) రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో ఆత్మకూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ, ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముందు వెళ్తున్న వాహనాన్ని..

సోమశిల: అనంతసాగరం మండలం ఉప్పలపాడు హైవేపై ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ప్రమాదం జరిగి ఓ యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గౌరవరం గ్రామానికి చెందిన వెంకట సుధ (29) కమ్మవారిపల్లిలో ఉంటున్న అక్క ఇంటికి మోటార్‌బైక్‌పై బయలుదేరాడు. ఉప్పలపాడు కూడలి వద్ద బొలెరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో అది బైక్‌ను ఢీకొంది. దీంతో సుధ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సోమశిల ఎస్సై సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.



వెంకటసుధ (ఫైల్)

కొనసాగుతున్న కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న వాహనాల వద్ద ఉదయగిరి సీఐ గిరిబాబు

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల సందర్భంగా ఘర్షణలకు పాల్పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని ప్రజలకు పోలీసు అధికారులు సూచించారు. నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లాలోని రాపూరు, మనుబోలు, లింగసముద్రం, వరికుంటపాడు, ఉదయగిరి, సీతారామపురం పోలీసుస్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక, నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో ఆయా ప్రాంత పోలీసు అధికారులు సోమవారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ పేరిట తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాల్లేని 31 మోటార్‌బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయా ప్రాంత ప్రజలతో మాట్లాడారు. వివాదాల్లో తలదూరిస్తే పోలీసు కేసులతో జీవితకాలం ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఘర్షణలకు దూరంగా ప్రశాంత జీవనం గడపాలన్నారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా పెట్టామన్నారు. గతంలో వివాదాలకు పాల్పడిన వారి కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే రౌడీషీట్లు తెరుస్తామన్నారు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి పత్రాలు తీసుకొస్తే పరిశీలిస్తామన్నారు. అంతా సక్రమంగా ఉంటే వాహనాలను ఇచ్చేస్తామన్నారు.

కండలేరులో 6.669 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.669 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పక్కాగా రెక్కీ.. 40 నిమిషాల్లోనే..

నెల్లూరు(క్రైమ్): చోరీలు చేయడానికి దొంగలు కొత్త దారులు వెతుకుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పడారుపల్లిలో ఉన్న ఏటీఎంలో సీసీ కెమెరాలను ధ్వంసం చేసి గ్యాస్ కట్టర్‌తో లాకర్‌ను కట్ చేసి నగదు దోచుకెళ్లిన ఘటన నెల్లూరులో కలకలం రేపింది. ఈ తరహా దొంగతనాలు గతంలో జరగలేదని పోలీసులు చెబుతున్నారు. ఏటీఎం వద్ద దుండగులు పక్కాగా రెక్కీ వేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఆ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండడం, సెక్యూరిటీ గార్డ్ లేకపోవడం, పోలీసు బీట్ సిబ్బంది ఎప్పుడు వస్తారు.. వెళ్తారు తదితర విషయాలను గమనించి నగదు దోపిడీకి పక్కాగా స్కెచ్ వేశారు. 12.50 గంటలకు దుండగులు ఏటీఎం వద్దకు చేరుకున్నారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసి గ్యాస్ కట్టర్‌తో లాకర్‌ను కట్ చేసి అందులోని నగదును దోచుకెళ్లారు. ఇదంతా 40 నిమిషాల వ్యవధిలోనే జరిగిపోయినట్లు పోలీసులు గుర్తించారు. దీనిని బట్టిచూస్తే దుండగులు ఆ ప్రాంతంపై పూర్తి అవగాహన తెచ్చుకున్నాకే దోపిడీకి పాల్పడినట్లు తెలుస్తోంది. సీఎంఎస్ ఇన్ఫో సిస్టం సీనియర్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ హేమనాథ్ ఫిర్యాదు మేరకు వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ కేసు నమోదు చేశారు. పోలీసులు ఏటీఎం సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీలు, సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. ఈ తరహా నేరాలకు పాల్పడే వ్యక్తులు, పాతనేరస్తులను విచారించాలని నారాయణను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. సోమవారం క్లూస్‌టీం ఘటనా స్థలంలో వేలిముద్రలను సేకరించింది. బ్యాంక్ అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.



ఏటీఎంను పరిశీలిస్తున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నారాయణ

ఉపాధి కూలీ మృతిపై ఏపీడీ విచారణ

ఉదయగిరి: ఉపాధి హామీ పనులకు వెళ్తూ ప్రమాదవశాత్తు చెరువులో పడి పెరుమాళ్ల వెంకటలక్ష్మి అనే మహిళ శనివారం మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం ఏపీడీ గాయత్రీదేవి, ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ ఈ ఘటనపై విచారణ చేపట్టారు. తోటి కూలీలను విచారించడంతోపాటు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఏపీడీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.50
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10

స్ట్రాంగ్‌రూమ్‌కు అంతర్ జిల్లాల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

కందుకూరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వేరే జిల్లాల్లో పని చేస్తున్న ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఆయా జిల్లాల నుంచి సోమవారం స్థానిక ఆర్‌ఓ కార్యాలయానికి తరలించారు. వాటిని రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఎన్నికల అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. నియోజకవర్గానికి చెంది పక్క జిల్లాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు అక్కడే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని ఎలక్షన్ కమిషన్ కల్పించింది. కందుకూరు నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 692 మంది అంతర్ జిల్లాల ప్రాతిపదికన పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును పొందారు. వారిలో 609 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిని ఆయా జిల్లాల ఎన్నికల అధికారుల నుంచి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి పంపారు. అలాగే అత్యవసర సర్వీస్ ఓట్లు 14 ఓట్లు రిటర్నింగ్ అధికారికి అందాయి. ఆర్మీ తదితర వాటిల్లో పనిచేస్తున్న 66 మందికి సర్వీస్ ఓటు హక్కును జారీ చేయగా ఇప్పటి వరకు 32 మంది వినియోగించుకున్నారు. ఓటు వేసేందుకు ఇంకా గడువు ఉండడంతో ఆయా ఉద్యోగులు ఓటు వేసి రిజిస్టర్ పోస్టు ద్వారా తమ ఓటును ఆర్‌ఓ కార్యాలయానికి పంపుతున్నారు. వీటిని అందుకుంటున్న ఎన్నికల అధికారులు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తున్నారు. ఈ మేరకు రాజకీయ పార్టీల చీఫ్ ఏజెంట్ల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్‌లు, సర్వీస్ ఓట్ల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద 24 గంటల నిఘాను ఉంచి పర్యవేక్షిస్తున్నారు. అదే సందర్భంలో ఆర్వోకు అందుతున్న సర్వీస్ ఓట్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందించి వారి సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ, టీడీపీ చీఫ్ ఎన్నికల ఏజెంట్లు ముప్పవరపు కిశోర్, ముచ్చు శ్రీనివాసులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్‌రూమ్ వద్ద అధికారులు, పోలీస్

వీసీబీ సభ్యులకు మెరుగైన సేవలు

• డైరెక్టర్ జేవీ సత్యనారాయణమూర్తి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'సహకార, అర్బన్ బ్యాంకింగ్ రంగంలో దక్షిణ భారతదేశంలోనే ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు (వీసీబీ) అగ్రగామిగా ఉంది. దీని ద్వారా సభ్యులకు మెరుగైన సేవలను అందించడం ఎంతో సంతోషంగా ఉంది' అని వీసీబీ డైరెక్టర్ జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న ఓ కల్యాణ మండపంలో సోమవారం నెల్లూరు బ్రాంచ్ సభ్యుల మహాసభ సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. 109 సంవత్సరాలుగా విశాఖపట్నం కేంద్రంగా బ్యాంకు కార్యకలాపాలు సాగిస్తూ సామాన్యుల బ్యాంకుగా పేరొందిందన్నారు. రూ.7,348 కోట్ల మైలురాయిని దాటి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.87 కోట్ల ఆదాయం ఆర్జించినట్లు చెప్పారు. నేడు రూ.353.61 కోట్ల షేర్ ధనంతో రికార్డు స్థాయికి వీసీబీ చేరుకోవడం అభినందనీయమన్నారు. నూతన సభ్యులు చేరేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సకాలంలో రుణాలు చెల్లిస్తే వారికి 4 శాతం నగదును ప్రోత్సాహకంగా తిరిగి ఇవ్వడం జరుగుతోందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మరో మూడు బ్రాంచ్‌లు ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతి వచ్చినట్లు చెప్పారు. వ్యక్తిగత ప్రమాద బీమా పథకం, మృతిచెందిన సభ్యుని కుటుంబానికి ఆర్థిక సాయం, ఇతర జాతీయ బ్యాంకుల కంటే డిపాజిట్లపై అధిక వడ్డీ, ప్రధానమంత్రి బీమా జీవన జ్యోతి, ఏటీఎం సౌకర్యం, ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం బ్రాంచ్ సీనియర్ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ టీఆర్‌కేవీ శర్మ, జోనల్ మేనేజర్ వెంకటేష్, బ్యాంకు వైస్ చైర్మన్ రాఘవరావు, లీగల్ అడ్వైజర్లు పెంచలయ్య, కె.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్లను సన్మానించిన దృశ్యం

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు పోలీసు అధికారులు జిల్లాలోని లాడ్జీల్లో తనిఖీలు చేశారు. అలాగే బహిరంగంగా మద్యం తాగే వారిపై కొరడా ఝుళిపించారు. లాడ్జీల్లో బస చేసిన వారిని ఎన్ని రోజులు నుంచి ఉన్నారు? ఎక్కడి నుంచి ఏ పని మీద వచ్చారు? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి లగేజ్‌లను తనిఖీ చేశారు. లాడ్జీల్లో దిగిన వ్యక్తుల ఆధార్‌కార్డుతోపాటు వారి పూర్తి వివరాలతో రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని, వాటిని రోజూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని నిర్వాహకులకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. చట్ట విరుద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వరాదని, చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లాడ్జీ పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. బహిరంగంగా మద్యం తాగే వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. వాహన తనిఖీలు నిర్వహించి మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు పెట్టారు.



బ్యాగ్‌ను తనిఖీ చేస్తున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నారాయణ

కోనలో హుండీ కానుకల లెక్కింపు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీల్లోని కానుకలను సోమవారం లెక్కించారు. భారీగా రాబడి వచ్చిందని డీసీ విజయసాగర్, సూళ్లూరుపేట చెంగాళమ్మ గుడి ఏసీ వెంకటేశ్వర్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల ఆరురోజులకు గానూ వచ్చిన కానుకలను శ్రీవారి అలంకార మండపంలో లెక్కించారు. రూ.33,76,445 నగదు, 44.9 మిల్లీ గ్రాముల బంగారం, 3.9 కిలోల వెండి వచ్చినట్లు వెల్లడించారు.



హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 162
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 282
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 312
లేయర్ చికెన్	: 204